

ధర్మస్థళ మంజునాథ స్వామి ఆలయం వద్ద భక్తుల సందడి

మహాశివరాత్రికి సర్వం సిద్ధం

బెంగళూరు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయాలు సర్వం సిద్ధం అయ్యాయి. బుధవారం తెల్లవారుజామునుంచే భక్తులు దర్శనం చేసుకునేందుకు వీలుగా కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. బెంగళూరు నగర వ్యాప్తంగా ప్రధాన ఆలయాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా బ్యారికేడ్‌లు ఏర్పాటు చేశారు. గవిగంగాధరేశ్వర ఆలయంలో తెల్లవారునుంచే దర్శనం ఉంటుందని ఆలయ కమిటీ ప్రకటించింది. కాడుమల్లేశ్వర ఆలయంలోనూ భారీ ఏర్పాట్లు చేశారు. హెచ్‌ఏఎల్ రోడ్డు మురుగేశ్‌పాళ్యలోని శివోహం ఆలయంలో 65 అడుగుల భారీ శివుడి విగ్రహానికి అలంకరణలు చేశారు. తొలిసారి మాతా వైష్ణోదేవి ఆలయ నమూనా ఏర్పాటు చేశారు. సనాతన ధర్మయాత్రను పోలి ఉండేలా రూపొందించారు. స్వామి వివేకానంద, ఆదిశంకరాచార్య, రామకృష్ణ పరమహంస, గురునానక్ వంటి ప్రముఖుల విగ్రహాలు సిద్ధమయ్యాయి. ఇక ధర్మస్థళ ఆలయానికి మంగళవారం ఉదయానికే పెద్దసంఖ్యలో భక్తులు చేరుకున్నారు. నంజనగూడులోని శ్రీకంఠేశ్వర ఆలయం, మలె మహదేశ్వర కొండలు, చిక్కబళ్ళాపురలో ఇషా ఫౌండేషన్ ఆధ్వర్యంలోని ఆదియోగి ఆలయం ఇతర ఆలయాల వద్ద అప్పుడే సందడి నెలకొంది. ఆలయాల సందర్శనకు భక్తులు సిద్ధం అవుతున్నారు.



హెచ్ఏఎల్ రోడ్డు మురుగేశ్‌పాళ్యలో ధ్యానముద్రలో మహాశివుడు



కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో డీకే శివకుమార్

కాలువల ఆధునీకరణకు సహకరించండి

● కేంద్ర జలశక్తి మంత్రికి డీసీఎం వినతి

బెంగళూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పలు ప్రాజెక్టులకు అనుబంధంగా ఉండే కాలువలను ఆధునీకరించాలని కేంద్ర జలశక్తిశాఖ మంత్రి సీఆర్ పాటిల్‌కు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, జలవనరులశాఖ మంత్రి డీకే శివకుమార్ విన్నవించారు. మంగళవారం ఢిల్లీలో కేంద్రమంత్రిని కలసి రాష్ట్రానికి సంబంధించిన ప్రాజెక్టుల పరిస్థితిని నివేదిక రూపంలో సమర్పించారు. కేంద్ర జలశక్తిశాఖ సహాయక మంత్రి సోమణ్ణ, రాష్ట్ర చిన్నతరహా నీటివనరులశాఖ మంత్రి బోసరాజుతోపాటు ఢిల్లీ అధికార ప్రతినిధి టీబీ జయచంద్ర, జలవనరులశాఖ కార్యదర్శి గౌరవ్‌గుప్తలు ఉన్నారు. భద్ర ఎడమకాలువ విస్తరణ, ఆధునీకరణకు సంబంధించి కేంద్రానికి డీపీఆర్ సమర్పించామన్నారు. తుంగభద్ర ఎడమకాలువ 226 కిలోమీటర్లు ఉందని, ఉత్తర కర్ణాటక ప్రాంత జిల్లాల సాగుకు ఇదే జీవనాధారమన్నారు. ఘటప్రభ కుడికాలువ ఆధునీకరించాల్సి ఉందన్నారు. సౌంతి ఎత్తిపోతల పథకం ద్వారా యాదగిరి, చిత్తాపుర తాలూకాలలో 1600 హెక్టార్లకు నీటిని సమకూర్చేందుకు డీపీఆర్‌ను 2015లోనే సమర్పించామన్నారు. రూ.673 కోట్లకు అనుమతులు ఇచ్చారని అయితే ఈ ప్రాజెక్టు రూ.804 కోట్లకు పెరిగిందన్నారు. కృష్ణ ఎగువ ప్రాజెక్టులో భాగంగా 172 కిలోమీటర్లు ఉండే ఇండి కాలువ ద్వారా 1.31 లక్షల హెక్టార్లకు నీరు సమకూరుతుందని, కాలువలను ఆధునీకరించాల్సి ఉందన్నారు. ఇందుకోసం రూ.2666 కోట్లు డీపీఆర్ సమర్పించామన్నారు. మలప్రభ ముూడోవిడత కాలువల ఆధునీకరణకు తీర్మానించామని ఇందుకోసం 3వేల కోట్ల రూపాయలు అవసరంగా ఉందన్నారు. రాష్ట్రానికి సంబంధించిన కీలకమైన ప్రాజెక్టులు కొన్నేళ్లుగా అనుమతులకు నోచుకోకుండా పెండింగ్‌లో ఉన్నాయని ఆమోదం తెలిపి గ్రాంట్లు విడుదల చేయాలని కోరారు.

కోర్టుకు హాజరైన నటుడు దర్శన్

బెంగళూరు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): చిత్రదుర్గ రేణుకాస్వామి హత్యకేసులో నటుడు దర్శన్‌తోపాటు నిందితులు అందరూ కోర్టు ముందు హాజరయ్యారు. మంగళవారం విచారణకు తప్పనిసరిగా హాజరు కావాల్సి ఉండడంతో అందరూ వచ్చారు. నిబంధనల బెయిల్‌పై విడుదలైన వారు కోర్టు విచారణకు తప్పనిసరిగా హాజరు కావాలనే షరతులు ఉన్నాయి. ఈమేరకు బెంగళూరులోని 57వ సెషన్స్ కోర్టుకు వచ్చినవారి హాజరును సిబ్బంది సేకరించారు. ఏ1 నటి పవిత్రాగౌడ, ఏ2 దర్శన్‌లు ఎదురెదురుగా కోర్టులో తారసపడినా దర్శన్ పలకరించలేదు. విచారణ అనంతరం దర్శన్ నేరుగా రాజరాజేశ్వరినగర్‌లోని ఇంటికి వెనుతిరిగారు. విచారణలు ఏప్రిల్ 2వ తేదీకి వాయిదాపడ్డాయి.



మహా వివాదం..!

● మహారాష్ట్రతో సరిహద్దు వివాదానికి 69 ఏళ్లు ● ఏటా కన్నడ రాజ్యోత్సవం వేళ గొడవలే..
● ఎంఈఎస్ ముసుగులోనే అరాచకాలు ● ఆరు రాష్ట్రాల సరిహద్దుల్లో ఇక్కడే సమస్య..!





ఎంఈఎస్ కార్యకర్తల దాడిలో గాయపడిన కండక్టర్ (ఫైల్)

బెంగళూరు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రానికి చివరగా మహారాష్ట్రకు అనుబంధంగా ఉండే బెళగావి జిల్లా సరిహద్దు వివాదం 69 ఏళ్లుగా రగులుతూనే ఉంది. భాషాప్రయుక్త రాష్ట్రాల విభజన నాటి నుంచి ఏటా ఈ ప్రాంతంలో గొడవలు, రెండు రాష్ట్రాల ప్రజల మధ్య దాడులు, ధర్నాలు కొనసాగుతున్నాయి. బెళగావి, ఉత్తరకన్నడ జిల్లాల పరిధిలో మరాఠా మాట్లాడేవారు నివసిస్తున్నారు. వారి జీవన సంప్రదాయం యథావిధిగా కొనసాగుతోంది. ప్రారంభంలో వారిలోనూ కన్నడ అభిమానం కొనసాగింది. అయితే మహారాష్ట్ర ఏకీకరణ సమితి (ఎంఈఎస్) పేరిట ఏర్పాటైన సంఘం ఓ రాజకీయ పార్టీగా మారి ఈ ప్రాంతంలో ఎన్నికల్లో పోటీ చేయడం పలుమార్లు కార్పొరేటర్లు, ఎమ్మెల్యేలు గెలుపొందడంతో ప్రాబల్యం పెరుగుతూ వచ్చింది. దీనికితోడు మహారాష్ట్రలోని శివసేన పార్టీ ఎంఈఎస్‌కు మద్దతు ఇవ్వడం అగ్నికి ఆజ్యం పోసినట్లు అయ్యింది. అయితే తరచూ సమస్యలతో స్థానికులు విలవిలలాడుతున్నారు.

రాజ్యోత్సవం నాడు 'బ్లాక్ డే'..!

కర్ణాటక వ్యాప్తంగా నవంబరు 1న కన్నడ రాజ్యోత్సవం ఓ పండుగలా జరుపుతారు. అదే రోజును బెళగావిలో ఎంఈఎస్ పార్టీ 'బ్లాక్ డే'గా పిలుపునివ్వడం వివాదంగా మారుతోంది. ఇక బెళగావిలో శాసనసభ శీతాకాల సమావేశాల సందర్భంలోనూ ఎంఈఎస్ వివిధ నిరసనలకు తెర లేపుతోంది. ఇలా సరిహద్దు వివాదం ఏడాదికి రెండుమూడుసార్లు తీవ్ర పరిణామాలకు దారి తీస్తోంది. ఇటీవల బెళగావిలో ఆర్టీసీ బస్సులో ఓ టిక్కెట్ వివాదాన్ని భాషా సమస్యగా మార్చారు. ఓ యువతీ యువకుడికి కండక్టర్ టిక్కెట్ అడిగితే మరాఠాలో మాట్లాడాలంటూ గొడవ చేసి ఏకంగా 20మంది కండక్టర్‌పై దాడి చేశారు. ఇలా ఐదు రోజులుగా రెండు రాష్ట్రాల మధ్య సుమారు 150 బస్సు సర్వీసులు నిలిచిపోయి వేలాదిమంది ప్రయాణాలకు ఆటంకం ఏర్పడింది.

1956 నుంచే రగులుతున్న వివాదం

1956లో భాషాప్రయుక్త రాష్ట్రాలుగా విభజన జరిగినప్పటి నుంచి వివాదం ఉంది. అంతకుముందు బెళగావి ప్రాంతం ముంబై ప్రాంతానికి చెందినది. ఎక్కువమంది కన్నడిగులు నివసిస్తున్నందున కొత్తగా ఏర్పాటైన మైసూరు రాష్ట్రంలోకి బెళగావి, ఉత్తరకన్నడ జిల్లాలను చేర్చారు. బెళగావిలో ఉండే వాతావరణం మంచి పంటలు పండే నేలను కర్ణాటకలో చేరడాన్ని మహారాష్ట్ర ప్రభుత్వం అంగీకరించలేదు. విలీనాన్ని వ్యతిరేకిస్తూ 1956లోనే కేంద్రానికి లేఖ రాసింది. మహారాష్ట్ర, కర్ణాటక సరిహద్దును మార్పు చేయాలని కోరింది. మైసూరు రాష్ట్రంలోకి చేరిన 814 పల్లెలను మహారాష్ట్రలోకి చేర్చాలని కోరారు. బెళగావి, నిప్పాణి నగరాలు కూడా ఇందులో ఉన్నాయి. దశాబ్దకాలంపాటు ఈ వివాదం కొనసాగగా 1966లో ముంబైలో జరిగిన అఖిలభారత కాంగ్రెస్ సభలో అప్పటి మహారాష్ట్ర సీఎం వీపీ నాయక్, కర్ణాటక సీఎం నిజలింగప్పలు భాగస్వామ్యులయ్యారు. రెండు రాష్ట్రాల మధ్య ఉండే వివాదాన్ని పరిష్కరించేందుకు ఒక కమిషన్ ఏర్పాటు చేయాలని సూచించారు. సదరు కమిషన్ తీర్మానాన్ని రెండు రాష్ట్రాలు అంగీకరించాలని నిర్ణయించిన మేరకు ఇద్దరు సీఎంలు సంతకాలు చేశారు.

ఏకీకరణ కోసమే సువర్ణసౌధ నిర్మాణం

కర్ణాటక రాష్ట్రం ఏర్పడకముందు హైదరాబాద్-కర్ణాటక, ముంబై కర్ణాటక, మైసూరు ప్రాంతంగా కొనసాగింది. మైసూరు రాజధానిగా ఉమ్మడి కర్ణాటక ఏర్పడ్డాక బెళగావి సరిహద్దు మినహా ఎక్కడా విభేదాలు లేవు. కర్ణాటకకు సరిహద్దులుగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కేరళ, గోవా, మహారాష్ట్రలు ఉన్నాయి. ఇన్ని రాష్ట్రాలతో ఏ విధమైన సరిహద్దు విభేదాలు లేవు. కావేరి నీటి విషయంలో తమిళనాడుతో గొడవలు ఉన్నాయి. అవి కూడా ఎవరికివారు వారి రాష్ట్రంలో చేసుకునే నిరసనలేగానీ కన్నడిగులు ఎవరూ తమిళనాడుకు వెళ్లి ఆందోళన చేయడంగానీ, అక్కడివారు కర్ణాటకలో వచ్చి నిరసనలు తెలిపిన విధానం లేదు. ఉమ్మడి కర్ణాటక విషయంలో పలుమార్లు విభేదాలు తలెత్తడం, ఉత్తర కర్ణాటకను ప్రత్యేక రాష్ట్రం చేయాలనే డిమాండ్‌లు తెరపైకి వస్తుండడంతో ప్రభుత్వం పకడ్బందీ నిర్ణయం తీసుకుంది. అందుకే కోట్లాది రూపాయలు వెచ్చించి బెళగావిలో సువర్ణసౌధను ఏర్పాటు చేశారు. ఏటా శాసనసభ శీతాకాల సమావేశాలు నిర్వహిస్తున్నారు.



అధ్యయనం కోసమే మహాజన్ కమిషన్

1966 అక్టోబరు 25న కేంద్రప్రభుత్వం, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి మెహెర్‌చంద్ మహాజన్ నేతృత్వంలో కమిషన్‌ను ఏర్పాటు చేసింది. కమిషన్ రెండు రాష్ట్రాలతోపాటు దక్షిణకన్నడ జిల్లా మంగళూరు పరిధిలోని కొన్ని ప్రాంతాలు కేరళలో చేరడంపైనా సమగ్ర అధ్యయనం చేశారు. 2,240 వినతులను స్వీకరించి 7,572 మంది అభిప్రాయాలు సేకరించారు. కమిషన్‌కు మహారాష్ట్ర ప్రభుత్వం కర్ణాటకలో చేరిన 814 గ్రామాలను అప్పగించాలని కోరింది. 1967 ఆగస్టు 25న మహాజన్ కమిషన్ నివేదికను కేంద్రప్రభుత్వానికి సమర్పించింది. నివేదిక ప్రకారం ఖానాపుర, నిప్పాణి, నందఘడతోపాటు 262 గ్రామాలను మహారాష్ట్రలోకి చేర్చాలని అప్పటివరకు మహారాష్ట్రలో ఉండే షోలాపూర్ జిల్లాను కర్ణాటకకు వదలాలని సిఫారసు చేసింది. బెళగావికి నిత్యం తాగునీటిని సమకూర్చే రక్కసకొప్ప అనే గ్రామాన్ని మహారాష్ట్రకు ఇవ్వాలని, హిండలగా ప్రాంతాన్ని కర్ణాటకలో చేర్చాలని, ఖానాపుర శివారులోని అటవీప్రాంతం, నిప్పాణిలోని పొగాకు అత్యధికంగా పండే ప్రాంతాలను మహారాష్ట్రలో చేర్చాలని సిఫారసు చేశారు. బెళగావి కర్ణాటకలోనే ఉండాలని సూచించిన కమిషన్ కేరళలోకి విలీనమైన కాసరగూడును కర్ణాటకకు వదిలిపెట్టాలని సిఫారసు చేశారు. బెళగావిలో 46శాతంమంది మరాఠీలు ఉండగా 54శాతం మంది కన్నడిగులు ఉన్నారు. వీరిలో ఎవరూ మహారాష్ట్రవైపు వెళ్లేందుకు ఇష్టం చూపడం లేదు. కానీ బెళగావిని దక్కించుకోవాలని మహారాష్ట్ర పట్టుబట్టింది. నివేదిక సిఫారసులను పార్లమెంటులో చర్చించాలని మెలిక పెట్టింది. కానీ నివేదికలో బెళగావిని మహారాష్ట్రకు అప్పగిస్తే, ఈ ప్రాంతంలో నివసించే ప్రజలకు సమస్య ఏర్పడుతుందని స్పష్టంగా నివేదికలో పొందుపరిచారు. భాష మాట్లాడే వారిని పరిగణనలోకి తీసుకోకుండా మహారాష్ట్రలో అత్యధిక జనాభా కల్గిన దళితుల ఇళ్లల్లో కన్నడ మాట్లాడతారని, వారి వ్యవహారాలు కన్నడలోనే ఉంటాయని సూచించింది. ఇలా 1967 డిసెంబరు 20న కర్ణాటక ప్రభుత్వం మహాజన్ నివేదికను అమలు చేసేందుకు ఆర్డినెన్స్ జారీ చేసింది.

మహాజన్ నివేదిక ప్రకారం బెళగావి కర్ణాటకలోనే మిగిలిపోయింది. అయితే మహాజన్ కమిషన్ ఏర్పాటుకు ముందు అంతిమనిర్ణయం కమిషన్‌దేనని అంగీకరించిన మహారాష్ట్ర ప్రభుత్వం ఆ తర్వాత పాటించేందుకు అంగీకరించలేదు. ఈ పరిణామమే సరిహద్దు వివాదం సుదీర్ఘ కాలం కొనసాగేందుకు కారణమైంది. అది కన్నడ, మరాఠీల వాగ్యుద్ధంగా మారింది. వీరికి వత్తాసు పలికేలా మహారాష్ట్ర ఏకీకరణ సమితి రాజకీయ పార్టీగా ఆవిర్భవించడంతో మరికొంత బలం చేకూరింది.

మహారాష్ట్రతో చర్చలు జరపండి

: చీఫ్ సెక్రటరీకి సీఎం ఆదేశం



బస్సులో టిక్కెట్ విషయమై తలెత్తి భాషా సమస్యగా మారి నాలుగురోజులుగా రెండు రాష్ట్రాల మధ్య బస్సు సంచారం నిలిచిపోవడంపై సీఎం సిద్దరామయ్య స్పందించారు. వెంటనే మహారాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో చర్చలు జరపాలని సీఎస్ శాలిని రజనీశ్‌కు సూచించారు. ప్రజలు ఇబ్బంది పడకుండా వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.



రిక్లైనర్ చైర్

రిక్లైనర్‌లో రిలాక్స్..!

● శాసనసభ లాంజ్‌లో ఎమ్మెల్యేలు కునుకు తీసేందుకు రిక్లైనర్ చైర్లు : స్పీకర్

బెంగళూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): శాసనసభ సమావేశాల వేళ ఎమ్మెల్యేలు సేద తీరేందుకు అనుకూలమైన రిక్లైనర్ చైర్లను ఏర్పాటు చేయనున్నారు. స్పీకర్ యూటీ ఖాదర్ మంగళవారం మీడియాకు ఈ వివరాలను తెలిపారు. శాసనసభ సమావేశాలు మార్చి 3న ప్రారంభం అవుతాయని, సమావేశాల వేళ మధ్యాహ్నం భోజనం తర్వాత ఎమ్మెల్యేలు కాస్త కునుకు తీయదలచుకుంటే వారికోసం 15 రిక్లైనర్ చైర్లను ఏర్పాటు చేస్తామన్నారు. వాటిని కొనుగోలు చేయడం లేదని కేవలం అద్దెకు తీసుకురాదలిచామన్నారు. గడిచిన శాసనసభ సమావేశాలలో సభ్యుల హాజరు తక్కువగా ఉండేదని, రానున్న బడ్జెట్ సమావేశాలకు పూర్తిస్థాయిలో పాల్గొంటారనే విశ్వాసం వ్యక్తం చేశారు.



బళ్లారి కలెక్టర్ కార్యాలయం ముందు కేఎస్ఆర్‌టీసీ సిబ్బంది నిరసన

కండక్టర్‌పై దాడికి నిరసన

● ఎంఈఎస్ ఆగడాలపై కేఎస్ఆర్టీసీ సిబ్బంది ఆగ్రహం

గుజరాత్‌లో రోడ్డు ప్రమాదం

● కుంభమేళాకు వెళ్తూ ఇద్దరు విజయపుర వాసుల దుర్మరణం

బెంగళూరు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ప్రయాగరాజ్‌లో జరుగుతున్న మహాకుంభమేళాలో పుణ్యస్నానం ఆచరించేందుకు వెళ్తూ గుజరాత్ రాష్ట్రం పోరుబందరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో విజయపుర జిల్లా వాసులు ఇద్దరు దుర్మరణం చెందారు. సోమవారం రాత్రి ప్రమాదం జరిగింది. ఆగియున్న లారీని గమనించక టెంపో ట్రావెల్ ఢీ కొనడంతో విజయపుర జిల్లా చడచణ పట్టణానికి చెందిన విశ్వనాథ అవజి (55), మల్లికార్జున సద్దలగి (40) ప్రమాదస్థలంలోనే మృతి చెందారు. డ్రైవర్‌తో కలిపి 12మంది చడచణ పట్టణం నుంచి ప్రయాగరాజ్‌కు బయల్దేరారు. ప్రమాదంలో నలుగురికి తీవ్రగాయాలు కాగా మిగిలిన ఆరుగురు స్వల్పగాయాలతో బయటపడ్డారు. పోరుబందరు పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



ఆందోళన చేస్తున్న నర్సులు

ఉద్యోగ భద్రత కల్పించాలి

నర్సుల ఆందోళన

బెంగళూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు పద్ధతిన ఏళ్ల తరబడి పని చేస్తున్నామని, ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వ ఆసుపత్రుల్లో పని చేస్తున్న నర్సులు ఆందోళన చేపట్టారు. నగరంలోని ఫ్రీడంపార్కులో మంగళవారం వివిధ జిల్లాల నుంచి తరలివచ్చిన నర్సులు నిరసన చేపట్టారు. వేలాదిమంది నర్సులు ఆందోళనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నేషనల్ హెల్త్ మిషన్‌లో భాగంగా సేవలందిస్తున్నామని, కొన్నేళ్లకాలంగా కాంట్రాక్టు పద్ధతిన పనిచేస్తున్నామన్నారు. ఏళ్ల తరబడి ఉద్యోగ భద్రత లేకుండా కొనసాగుతున్నామన్నారు. వెంటనే వేతనాలు పెంచాలని, రెగ్యులర్ చేయాలని ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో అన్ని సౌలభ్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.






ఘటనపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే నారాయణ స్వామి, మంజుల (ఫైల్)

ఏనుగు దాడిలో మహిళా రైతు మృతి

బంగారపేట, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని సరిహద్దులో ఒంటరి ఏనుగు దాడిలో మహిళా రైతు మృతి చెందింది. కామసముద్ర హోబళి సాకరసనహళ్ళి వద్ద మంగళవారం తెల్లవారుజామున మహిళరైతు మంజుల (44) మూత్ర విసర్జన కోసం వెళ్లిన వేళ ఏనుగు దాడిచేయడంతో మృతి చెందింది. సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు, కామసముద్ర పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. సరిహద్దుల్లో ఒంటరిఏనుగు ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణస్వామి బాధిత మహిళా కుటుంబాన్ని పరామర్శించారు. సరిహద్దు ప్రాంతాల్లో తరచూ ఏనుగు దాడులు జరుగుతున్నాయని, పెండింగ్‌లో ఉన్న సోలార్ ఫెన్సింగ్ ప్రక్రియను పూర్తి చేస్తామని, అటవీశాఖ నుంచి పరిహారం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు.



అనంతపురంలోని మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వరాలయంలో ప్రత్యేక ఏర్పాట్లు

బ్రహ్మకుమారీలు ఏర్పాటు చేసిన హిమాలయాల సెట్టింగ్, హిమలింగం, హిమాలయాల సెట్టింగ్ ముందు దీపాలను వెలిగిస్తున్న మహిళలు

ఈశా..మహేశా..!

శివరాత్రికి శైవక్షేత్రాలు ముస్తాబు... నేడు ప్రత్యేక పూజలు, అభిషేకాలు

మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని ఉమ్మడి జిల్లాలోని ప్రసిద్ధ శైవక్షేత్రాలు ముస్తాబయ్యాయి. పండుగ సందర్భంగా బుధవారం స్వామి వారికి అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించనున్నారు. శివపార్వతుల కల్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఆయా ఆలయ కమిటీలు సమాయత్తమయ్యాయి. శ్రీసత్యసాయి జిల్లాలోని లేపాక్షి ఆలయంలో బ్రహ్మోత్సవాలు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. పెనుకొండ సమీపంలోని ప్రకృతి ఒడిలో అలరారుతున్న శ్రీకైలాసం క్షేత్రంలో శివరాత్రి పర్వదినాన్ని కన్నుల పండువగా నిర్వహించనున్నారు. అనంత జిల్లాలోని కంబదూరులో వెలసిన మల్లేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారి కల్యాణం నిర్వహించారు. బుధవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నారు. యాడికి మండలంలోని కోనుప్పలపాడు సమీపంలోని కోన రామలింగేశ్వరస్వామి ఆలయం కూడా పరమేశ్వరుడి పర్వదినానికి సిద్ధమైంది.

కొండ కోనల్లో రామలింగేశ్వరుడు



కోన రామలింగేశ్వరస్వామి

యాడికి, ఫిబ్రవరి25(ఆంధ్రజ్యోతి): శివరాత్రి వేడుకలకు మండలంలోని కోన రామలింగేశ్వరస్వామి ఆలయం ముస్తాబయ్యింది. ఏటా మహాశివ రాత్రి పర్వదినం సందర్భంగా స్వామి వారి కల్యాణం వైభవంగా నిర్వహిస్తారు. స్వామివారి రథోత్సవం నిర్వహిస్తారు. ఇక్కడి శివలింగాన్ని పరశురాముడు ప్రతిష్ఠించినట్లు కోనుప్పలపాడు గ్రామ పెద్దలు చెబుతున్నారు. స్వామివారి దర్శనానికి యాడికి, తాడిపత్రి, పెద్దపప్పూరు, పెద్దవడుగూరు మండలాల ప్రజలతోపాటు నంద్యాల జిల్లా ప్యాపిలి, అవుకు తదితర మండలాల ప్రజలు భారీగా తరలివస్తారు. ఆలయం చుట్టూ ఉండే కొండలతో ప్రకృతి రమణీయంగా గోచరిస్తుంది. ఆలయం ఎదురుగా ఉన్న కొలను గుండం, వర్షాకాలంలో కొలను గుండంలోని జాలువారే సహజ సిద్ధ జలపాతం కనువిందు చేస్తాయి. ఆలయం నుంచి అరకిలోమీటర్ దూరంలో కొండలపై నుంచి నిరంతరం జాలువారే సహజ సిద్ధ జలపాతం ఇక్కడి ప్రత్యేకత. వర్షాకాలంలో ఈ జలపాతం వద్దకు పర్యాటకుల తాకిడి ఎక్కువగా ఉంటుంది.

అబ్బురపరిచే మర్రిచెట్టు



ఆలయం వద్ద ఎకరా విస్తీర్ణంలో ఉన్న మర్రిచెట్టు

కోనరామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద సుమారు ఎకరా విస్తీర్ణంలో పెద్దమర్రి చెట్టు విస్తరించి ఉంది. కోనకు వెళ్లిన భక్తులు చిన్న, పెద్ద తేడా లేకుండా మర్రి ఊడలు పట్టుకొని ఊయల ఊగుతుంటారు. కోనకు వెళ్లిన వారు మర్రిచెట్టు కిందనే సేదతీరుతుంటారు. ఇటీవల కూటమి ప్రభుత్వం ఏపీ టూరిజం, పల్లెపండుగ కింద రూ.37లక్షలు, క్లాస్-1 కాంట్రాక్టర్ చవ్వా గోపాల్‌రెడ్డి మరికొంత తన సొంత నిధులు వెచ్చించి కోనకు వెళ్లే ప్రధాన రహదారి నుంచి ఆలయం వరకు సీసీ రోడ్డు నిర్మాణం పనులు పూర్తిచేశారు. ఆలయం వద్ద ఉన్న కోనేటి గుండంను శుభ్రం చేయించారు. భక్తుల వాహనాల పార్కింగ్‌కు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



శ్రీకైలాసగిరి క్షేత్రంలో ఏర్పాటు చేసిన శివుని విగ్రహం

రేపు కల్యాణోత్సవం, రథోత్సవం

ఈనెల 27న కోన రామలింగేశ్వరస్వామి కల్యాణోత్సవం, రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నారు. అనంతరం ఓబులాపురం, కోనుప్పలపాడు గ్రామాల్లో స్వామివారి ఉత్సవ విగ్రహాల ఊరేగింపు నిర్వహించనున్నారు.

ఇలపై శ్రీకైలాసం

పెనుకొండ రూరల్: మహా శివరాత్రి వేడుకలకు శ్రీకైలాసం క్షేత్రం సిద్ధమయ్యింది. ఈ క్షేత్రం మండలంలోని గొందిపల్లి సమీపంలోని కొండల మధ్య ఉంది. పెనుకొండ నుంచి 20కి.మీ. దూరంలో ఉన్న ఇక్కడ ఆలయంలో శివుడు లింగం రూపంలో దర్శనమిస్తారు. శ్రీకైలాసగిరి శిఖరం నుంచి జాలువారే నీటి మధ్యన 40అడుగుల శివుడి విగ్రహం నిర్మించారు. ఏడుగురు అక్కమ్మగార్లు, శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయం దాతల సహకారంతో నిర్మించారు. శివరాత్రి పండగరోజు పెనుకొండ, ధర్మవరం తదితర ప్రాంతాల నుంచి ఇక్కడికి భక్తులు వస్తారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆలయ అర్చకులు తిరుపతిస్వామి తెలిపారు. బుధవారం తెల్లవారుజామునుంచే శ్రీకైలాసగిరి క్షేత్రంలో స్వామివారికి అఖండజ్యోతి, ఆలయం ముందు హోమాలు, కైలాసనాథుడి ఊరేగింపు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు.



శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయం



శ్రీకైలాసంలోని కోనేరు

మల్లేశ్వరుడి కల్యాణ వైభోగం



కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు అమిలినేని సురేంద్రబాబు, పరిటాల సునీత కుటుంబసభ్యులు



స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ

కళ్యాణదుర్గం: కంబదూరు మల్లేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం శివపార్వతుల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కల్యాణోత్సవంలో కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, భార్య రమాదేవి, కోడలు ఇషిత, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, కోడలు పరిటాల జ్ఞాన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న శివపార్వతుల కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. ఎంతో ప్రాశస్త్యం ఉన్న కంబదూరు మల్లేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నట్లు ఇద్దరు ఎమ్మెల్యేలు పేర్కొన్నారు. కళ్యాణదుర్గం, రాప్తాడు ప్రాంత వాసులకు జీవనాడి అయిన పేరూరు, బీటీపీ ప్రాజెక్టు పనులు త్వరగా పూర్తి కావాలని ఆ పరమేశ్వరుడికి ప్రత్యేకపూజలు చేశామని వారు వెల్లడించారు. వారికి వేద పండితులు మల్లేశ్వరస్వామి జ్ఞాపికను అందజేసి పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు



లేపాక్షిలో..

లేపాక్షి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా లేపాక్షి దుర్గా వీరభద్రస్వామి ఆలయంలో మంగళవారం ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయంలో దేవతామూర్తులను ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. మహాగణపతి సుదర్శనహోమం, యాగాలు నిర్వహించారు. సాయంకాలం గ్రామోత్సవంలో శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం ధ్వజారోహణ, అంకురార్పణ విశిష్ట పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు దీపోత్సవం, స్వామివారి కల్యాణోత్సవం

ఉత్సవాల్లో భాగంగా బుధవారం శివపార్వతుల కల్యాణవేదికగా ఆలయం మారనుంది. శివపార్వతుల కల్యాణోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించనున్నట్లు అర్చకులు తెలిపారు.



ప్రత్యేక అలంకరణలో వీరభద్రస్వామి, దుర్గాదేవి



పురవీధుల్లో ఊరేగుతున్న శివపార్వతులు

జాతీయ హాకీ జట్టుకు ఎంపిక



జాతీయ హాకీ పోటీల్లో పాల్గొనే రాష్ట్ర మహిళా జట్టు

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి హాకీ జట్టుకు అనంతపురం, సత్యసాయి జిల్లా క్రీడాకారిణులు ఎంపికయ్యారు. నెల్లూరు నగరంలోని ఏసీ స్టేడియంలో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి మహిళల సీనియర్ హాకీ పోటీల్లో అనంతపురం జిల్లాకు చెందిన లక్ష్మీరేవతి, సత్యసాయి జిల్లాకు చెందిన పావని సత్తా చాటి జట్టులో స్థానం సంపాదించారు. మార్చి 1వ తేదీ నుంచి 12వ తేదీ వరకు హర్యానాలో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు వీరు ప్రాతినిథ్యం వహించనున్నారు. కాగా జాతీయజట్టుకు ఎంపికైన క్రీడాకారిణులకు నెల్లూరు ఏసీ స్టేడియంలో ఇస్తున్న శిక్షణ మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో నెల్లూరు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి ఆర్కే యతిరాజ్ మాట్లాడుతూ ఎంపికైన క్రీడాకారిణులు రాష్ట్రస్థాయి మహిళల సీనియర్ హాకీ పోటీల్లో సత్తా చాటాలన్నారు.

హెచ్చెల్సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా రామ్మోహన్

అనంతపురం టౌన్/క్లాక్‌టవర్, ఫిబ్రవరి25 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు డిప్యూటీ కలెక్టర్ రామ్మోహన్ బదిలీపై వచ్చారు. రాష్ట్రంలో పలువురు డిప్యూటీ కలెక్టర్లను ప్ర భుత్వం బదిలీ చేసింది. అందులో భాగంగా వెయిటింగ్‌లో ఉన్న రామమోహన్‌ను హెచ్చెల్సీ భూసేకరణ విభాగానికి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా నియమించింది. ఇదివరకు ఇక్కడ పనిచేస్తున్న వసంతబాబు కళ్యాణదుర్గం ఆర్డీఓగా బదిలీ అయ్యారు.

ముగిసిన ఇంటర్వ్యూలు

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి25(ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతులకు రుణాల ఇంటర్వ్యూలు మంగళశారం ముగిశాయి. జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటర్వ్యూల్లో 18మంది దరఖాస్తులు చేసుకోగా 14 మందిని ఎంపిక చేశారు. ముగ్గురు అభ్యర్థులకు అర్హతలు లేకపోవడంతో తిరస్కరించారు. మరొకరు గైర్హాజరయ్యారు. ఎంపికైన 14 మందికి రూ.33 లక్షల విలువైన యూనిట్లు మంజూరు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ ప్రక్రియలో జిల్లా పరిశ్రమల కేంద్రం ఏడీ రాజశేఖర్, పశుసంవర్థక శాఖ జేడీ వెంకటేశ్వర్, బీసీ కార్పొరేషన్ ఈడీ సుబ్రహ్మణ్యం, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రాధిక, మెప్మా పీడీ విశ్వజ్యోతి, గిరిజన సంక్షేమశాఖ జిల్లా అధికారి రామాంజనేయులు, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ ఏడీ వినోద్ పాల్గొన్నారు.

హెచ్చెల్సీకి మళ్లీ నీరు

అర టీఎంసీ విడుదల... కేసీ కెనాల్ వాటా మళ్లింపు

రాయదుర్గం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర ఎగువ కాలువ (హెచ్చెల్సీ)కి అదనంగా అర టీఎంసీ నీటిని మంగళవారం సాయంత్రం బోర్డు అధికారులు విడుదల చేశారు. రోజుకు 700 క్యూసెక్కుల నీటిని విడుదల చేయాలని అనంతపురం హెచ్చెల్సీ ఎస్ఈ రాజశేఖర్ ఇండెంట్ సమర్పించారు. కేసీ కెనాల్ వాటా నీటిలో అర టీఎంసీని హెచ్చెల్సీకు మళ్లించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, విప్ కాలవ శ్రీనివాసులు కోరారు. హెచ్ఎల్ఎంసీ, జీబీసీ ఆయకట్టులో ఆలస్యంగా పంటలు సాగు చేయడంతో రెండు తడుల నీరు అందిస్తే కోత చేసుకోవచ్చనీ, అందుకోసం అర టీఎంసీ నీరు కేటాయించాల్సిందిగా వీరు కోరారు. దీంతో పంటను కాపాడుకునేందుకు వీరి విన్నపాన్ని మన్నించి రైతుల శ్రేయస్సు కోసం అర టీఎంసీ నీటిని హెచ్చెల్సీకి మళ్లిస్తూ భారీ నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ వెంకటేశ్వరరావు.. బోర్డు అధికారులకు ఉత్తర్వులను పంపించారు. ఈ నేపథ్యంలో అర టీఎంసీ నీటి విడుదలకు అంగీకరిస్తూ.. మంగళవారం సాయంత్రం డ్యాంలో విడుదల చేశారు. వారం క్రితమే ప్రభుత్వం అర టీఎంసీ నీరు అందించాలని ఉత్తర్వులు ఇచ్చినా.. కర్ణాటక మాత్రం కేసీ కెనాల్ నీటిని హెచ్చెల్సీకి మళ్లించకుండా అడ్డుకునే ప్రయత్నం చేసింది. బోర్డు అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి హెచ్చెల్సీకి నీరు విడుదల చేయకుండా అడ్డుపడింది. అయినప్పటికీ మంత్రి, విప్ చొరవ చూపి బోర్డు అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి కర్ణాటకను ఒప్పించడంలో సఫలీకృతులయ్యారు. దీంతో ఆలస్యంగానైనా మళ్లింపు జలాలు విడుదల చేశారు. రోజుకు 700 క్యూసెక్కుల ప్రకారం మార్చి 4వ తేదీ వరకు అర టీఎంసీ నీటిని తీసుకునేలా అధికారులు డిజైన్ చేశారు. ఇప్పటికే కర్ణాటక పరిధిలోని డిస్ట్రిబ్యూటరీల్లో జలచౌర్యానికి ఆస్కారం లేకుండా నేరుగా ఆంధ్ర సరిహద్దు వరకు నీరు చేరుకునేలా బోర్డు అధికారులు పర్యవేక్షణ చేస్తున్నారు. సింగిల్ ఇండెంట్ కావడంతో 0.5 టీఎంసీల జలాల్లో ప్రవాహ నష్టం అధికంగానే ఉంటుంది. ఇప్పటికే కాలువలో నీరు పూర్తిగా ఎండిపోవడంతో ప్రవాహ వేగం కూడా మందకొడిగా ఉండి బుధవారం అర్ధరాత్రికి ఆంధ్ర సరిహద్దుకు జలాలు చేరుకునే అవకాశం ఉన్నట్లు అధికారులు భావిస్తున్నారు. ఆ మేరకు ఏర్పాట్లను పూర్తి చేసి, జీబీసీ వరకు జలాలను తరలించేలా చర్యలు చేపట్టారు. హెచ్ఎల్ఎంసీ పరిధిలో ఉన్న మొక్కజొన్నతోపాటు జీబీసీలోని మిర్చి పంటలను నీటిని రెండు తడులుగా అందించేలా చర్యలు తీసుకుంటున్నారు. జీబీసీ వరకు నీటిని ప్రవహించేలా చేసుకుని అక్కడ నుంచి ముందుకు వెళ్లకుండా కణేకల్లు చెరువు వద్ద నుంచి నీటిని వినియోగించుకునే విధానాన్ని అమలు చేస్తున్నారు.

జిల్లాను సారా రహితంగా మారుద్దాం

- సమీక్షలో కలెక్టరు, ఎస్పీ



పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టరు, ఎస్పీ, జేసీ ఇతర అధికారులు

అనంతపురం టౌన్, ఫిబ్రవరి25 (ఆంధ్రజ్యోతి): నాటుసారా తాగడం వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజలకు చైతన్యం కలిగించి, జిల్లాను సారా రహితంగా మారుద్దామని కలెక్టరు వినోద్‌కుమమార్, ఎస్పీ జగదీష్ పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో నవోదయం2.0పై మంగళవారం సమీక్ష నిర్వహించారు. కలెక్టరు మాట్లాడుతూ నాటుసారా ప్రజల ఆరోగ్యాన్ని, ఆర్థిక మూలాలను దెబ్బతీస్తుందనే ప్రభుత్వం నవోదయం 2.0 కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. క్షేత్రస్థాయిలో ప్రభుత్వ లక్ష్యం నెరవేరేలా అధికారులందరూ పనిచేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు రెండునెలలు పాటు నిర్వహించడానికి ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. జిల్లాలో మద్యం పీడిత గ్రామాలును ఏబీసీ కేటగిరీలుగా విభజించినట్లు తెలిపారు. ఏ కేటగిరీలో 24గ్రామాలు, బీ కేటగిరీలో 44గ్రామాలు, సీ కేటగిరీలో 36 గ్రామాలు ఉన్నాయన్నారు.

డ్రోన్లతో నాటుసారా ప్రాంతాలపై నిఘా: ఎస్పీ

నాటుసారా నివారణకు కఠినచర్యలు తీసుకుంటామని ఎస్పీ జగదీష్ పేర్కొన్నారు. నాటుసారా తయారు చేసే అటవీప్రాంతాలతో పాటు అనుమానం ఉన్న ఏరియాలలో డ్రోన్‌లతో తనిఖీలు నిర్వహిస్తూ నిఘా ఉంచుతున్నామన్నారు. కార్యక్రమంలో జేసీ శివనారాయణశర్మ, ఆర్డీఓ కేశవ నాయుడు, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య, అసిస్టెంట్ కమిషనర్ మునుస్వామి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామ్మోహన్‌రెడ్డి, డీఎంహెచ్ఓ డాక్టరు ఈబీదేవి, జడ్పీ సీఈఓ రామచంద్రారెడ్డి, విద్య వెల్ఫేర్‌శాఖల అధికారులు పాల్గొన్నారు.

గిడ్డంగులను సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా సహకార శాఖాధికారి అరుణకుమారి



మాట్లాడుతున్న డీసీఓ అరుణకుమారి

అనంతపురంరూరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): రైతులు ప్రభుత్వ గిడ్డంగులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సహకార శాఖాధికారి (డీసీఓ) అరుణకుమారి పేర్కొన్నారు. గుత్తిరోడ్డులోని ఆంధ్రప్రదేశ్ గిడ్డంగుల నిర్మాణ సంస్థలో ఐసీఎం గిడ్డంగి నియంత్రణ అభివృద్ధి వారి ఆధ్వర్యంలో గిడ్డంగుల వినియోగంపై రైతులకు మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి అరుణకుమారి, రాష్ట్ర ఐసీఎం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ శ్యాంకుమార్, గిడ్డంగుల నిర్మాణ సంస్థ డీఎం ఖాన్, పీఏసీఎస్ చైర్మన్ రోషన్ జమీజర్, సీఈఓ శ్రీనివాసులు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ పండించిన పంటకు గిట్టుబాటు ధర లేకపోతే రైతులు తమ దిగుబడులను నిల్వ చేసుకోవడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిడ్డంగులను నిర్మించాయన్నారు. అద్దె చెల్లింపులు ప్రైవేట్ గిడ్డంగుల కంటే కూడా తక్కువేన్నారు. ప్రభుత్వ గిడ్డంగుల్లో నిల్వ ఉంచిన దిగుబడులకు సంబంధించిన అధికారులు ఇచ్చే రసీదులను తీసుకువెళ్లి బ్యాంకులో రుణాలు కూడా పొంద వచ్చునన్నారు. కార్యక్రమంలో కొడిమి, నరసనాయనికుంట, సోములదొడ్డి, పాములరాయి. కురుగుంట, అక్కంపల్లి, నాగిరెడ్డిపల్లి, రాచానపల్లి, చిన్నంపల్లి తదితర గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

పీ4 సర్వే పరిశీలన

బత్తలపల్లి ఫిబ్రవరి25(ఆంధ్రజ్యోతి): బత్తలపల్లితోపాటు మండలంలోని పోట్లమర్రిలో మం గళవారం పీ4 సర్వే రాష్ట్ర పరిశీలకుడు శ్రీమంత్‌సాయి పర్యటించారు. సర్వే తీరును పరిశీలించారు. సర్వేలో ఎదురవుతున్న ఇబ్బందులను సచివాలయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సర్వేపై అపోహలు అవసరం లేదని ప్రజలకు ఆయన సూచించారు. కార్యక్రమంలో గణాంకాల అధికారి శర్మ, వీఆర్వో రాణాప్రతాప్ పాల్గొన్నారు.




సర్వేను పరిశీలిస్తున్న శ్రీమంత్‌సాయి

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

కాళేశ్వరరావు (వర్ధంతి)



అయ్యదేవర కాళేశ్వరరావు 1881 జనవరి 22న కృష్ణా జిల్లా నంది గామలో జన్మించారు. మహాత్మా గాంధీ నాయకత్వంలోని అన్ని ఉద్యమాలు, స్వాతంత్ర్య పోరాటంలో చురుగ్గా పాల్గొని కారాగార శిక్ష అనుభవించారు. ప్రజాప్రతినిధిగా ఆయన విజయవాడ పురపాలక సంఘానికి అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. ఎంతోమందికి విద్యాదానం చేశారు. రాజగోపాలాచారి నేతృత్వంలో ఉమ్మడి మద్రాసు ప్రభుత్వం ఏర్పడినప్పుడు మద్యపాన నిషేధ చట్టం, సేల్స్‌ట్యాక్స్, హరిజన దేవాలయ ప్రవేశ చట్టాల రూపకల్పనలో కాళేశ్వరరావు కీలకంగా వ్యవహరించి అందరి ప్రశంసలు పొందారు. 1955లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా విజయవాడ నియోజకవర్గం నుంచి ఎన్నికై తొలి స్పీకర్‌గా వ్యవహరించారు. గ్రంథాల ప్రచురణలోనూ చొరవ చూపారు. 1962 ఫిబ్రవరి 26న కన్నుమూశారు.

బజరంగ్ పూనియా (పుట్టినరోజు)



రెజ్లింగ్ క్రీడాకారుడిగా రాణించిన బజరంగ్ పూనియా 1994 ఫిబ్రవరి 26న హర్యానా రాష్ట్రం ఝూఝర్ జిల్లా ఖుదాన్ ప్రాంతంలో జన్మించారు. 2013 నుంచి 2019 వరకు వరల్డ్ చాంపియన్‌షిప్స్ పోటీలలో 60 నుంచి 65 కిలోల విభాగంలో కాంస్య, రజత పతకాలు సహా ఇతర స్థానాలలో నిలిచి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు. ఫ్రీస్టైల్ రెజ్లింగ్‌లో సాధనలకు అర్జున అవార్డు, రాజీవ్‌గాంధీ ఖేల్ రత్న ఉన్నత పురస్కారాలు అందుకున్నారు. 2020లో ఫిక్కీ ఇండియా స్పోర్ట్స్ అవార్డు, 2021లో పద్మశ్రీ పొందారు. 2022లో బర్మింగ్‌హామ్ కామన్‌వెల్త్ గేమ్స్‌లో బంగారు పతకం సాధించారు. ఇతర యూనివర్సిటీలనుంచి గౌరవాలు అందుకున్నారు. ప్రస్తుతం రైల్వే శాఖలో గెజిటెడ్ ఆఫీసర్‌గా కొనసాగుతున్నారు. ఇటీవల తన సహచర క్రీడాకారుడు వినేశ్ ఫోగట్‌తో కలసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. క్రీడాకారిణి సంగీత ఫోగట్‌ను పెళ్లి చేసుకున్నారు.

ఎలకా వేణుగోపాలరావు (పుట్టినరోజు)



ఎలకా వేణుగోపాలరావు 1982 ఫిబ్రవరి 26న విశాఖపట్నంలో జన్మించారు. భారత జాతీయ క్రికెట్ జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. కుడి చేయి బ్యాటింగ్, ఆఫ్ స్పిన్ బౌలింగ్ శైలితో రాణించారు. అలాగే రంజీలలో ఆంధ్ర క్రికెట్ జట్టులో 121 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లలో 7081 పరుగులతో యావరేజ్ 40.93 రన్‌రేట్‌గా నిలిచారు. 17 సెంచరీలు, 30 హాఫ్‌సెంచరీలు చేశారు. వన్డే ఇంటర్నేషనల్ క్రికెట్‌లో దేశంలో తొలి 'సూపర్ సబ్'గా గుర్తింపు పొందారు. ఐపీఎల్‌లో డెక్కన్ చార్జర్స్, ఢిల్లీ డేర్ డెవిల్స్, సన్ రైజర్స్ హైదరాబాద్ జట్లుల తరపున ఆడారు. 2017లో క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించారు.

నీరు కలుషితమై చేపలు మృతి



మృతి చెందిన చేపలు

రాయచూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : రాయచూరు తాలూకాలోని కాడ్లూరు, హెగ్గసనహళ్ళి, గంజళ్ళి తదితర గ్రామాల మీదుగా వెళుతున్న వాగు నీరు కలుషితం కావడంతో మంగళవారం వేల సంఖ్యలో చేపలు మృత్యువాత పడ్డాయి. రెండు రోజుల క్రితం నీరు కలుషితమైనట్లు గ్రామస్థులు ఫిర్యాదు చేయగా అధికారులు నీటి శాంపిల్ సేకరించేందుకు రెండు రోజులుగా తిరిగి రాకపోవడంతో ఇప్పటికే వేల సంఖ్యలో చేపలు మృత్యువాతపడి పరిసర ప్రాంతాలంతా దుర్వాసన వెదజల్లుతున్నట్లు ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ మార్గంలో నిత్యం సంచరించే వారు ముక్కుమూసుకుని వెళ్లే దుస్థితి తలెత్తిందని అధికారులు కేవలం నామ మాత్రంగా నీటి శాంపిల్‌ను సేకరించి తప్పులు నివేదిక ఇచేందుకు సిద్ధమైయ్యారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. గ్రామ సమీపంలో చుట్టుముట్టు ఉన్న పలు పారిశ్రామిక వాడల్లో నుంచి రసాయనిక వాగులోకి వదలడం వల్లే ఈ దుస్థితి తలెత్తినట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. కంపెనీల యజమానులతో అధికారులు కుమ్మక్కై తమ ఫిర్యాదులు పట్టించుకోవడం లేదని నీటి శాంపిల్‌ళ్లు సేకరించినా తాము ఫిర్యాదు చేసినా రెండు రోజుల అనంతరం నీటిని సేకరించడం వల్ల ఎలాంటి ఉపయోగం ఉండదంటు గ్రామస్థులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ముడా వ్యవహారంలో ఎలాంటి విచారణకైనా సిద్ధం

● ఎంపీ కుమార్‌నాయక్

రాయచూరు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మైసూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (ముడా) పరిధిలో నివేశనం స్థళాల పంపిణీకి సంబంధించి ఎలాంటి నిబంధనల ఉల్లంఘన జరపలేదని రాయచూరు ఎంపీ, అప్పటి మైసూరు జిల్లాధికారి జీ కుమార్ నాయక్‌తెలిపారు. ప్రస్తుతం లోకాయుక్త అధికారులు జరుపుతున్న ఎలాంటి విచారణకైన తాను సిద్ధమేనని అన్ని వివరాలు ఇప్పటికే లోకాయుక్త విచారణ అధికారులకు తెలియజేశానన్నారు. మంగళవారం నగరంలోని తనను కలిసిన విలేఖరులతో మాట్లాడిన కుమార్ నాయక్, ఇటీవల లోకాయుక్త అధికారులు ఇచ్చిన నివేదిక అంశాలను తాను ఇంకా చూడలేదని పూర్తి వివరాలు అందిన అనంతరం అన్ని వివరాలతో మాట్లాడగలనన్నారు. అప్పటి జిల్లాధికారిగా తాను తహసీల్దార్ ఇచ్చిన నివేదిక ఆధారంగా నిబంధనల మేరకు నివేశన స్థళాల పంపిణీకి ఆదేశాలు ఇచ్చామని ఇందులు ఎలాంటి రాజకీయ ఒత్తిడులు దురుద్దేశాలు అవినీతికి తావివ్వలేదని కుమార్ నాయక్ స్పష్టం చేశారు.

ఈ-ఖాతాలకు దళారులను ఆశ్రయించరాదు



నగరసభ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే రవికుమార్ తదితరులు

శిడ్లఘట్ట, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఇ-ఖాతాలకు సంబంధించి ప్రజలు ఎవరూ దళారులను ఆశ్రయించరాదని ఎమ్మెల్యే బీఎన్ రవికుమార్ సూచించారు. నగరసభ కార్యాలయంలో అధ్యక్షుడు ఎంవీ వెంకటస్వామి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ముస్లింలు అధికంగా ఉండే వార్డులలో ఉర్దూ భాషలో కరపత్రాలు పంపిణీ చేసి అవగాహన కల్పించాలని సూచించారు. శిడ్లఘట్ట పట్టణంలో మీ సర్వే ప్రకారం 6600 అనధీకృత ఆస్తులు ఉండగా మా అంచనా ప్రకారం 7600 అనధీకృత ఆస్తులు ఉన్నాయన్నారు. ప్రతి ఐదు లేదా ఆరు వార్డులలో ఒక బృందాన్ని ఏర్పాటు చేసి ఆస్తుల కొలతలు, సరిహద్దులను గుర్తించి, చుట్టుపక్కల వారితో మహజరు చేసిన వాటికి 8 రోజుల్లోగా ఇ-ఖాతా చేసేలా చర్యలు చేపట్టాలని నగరసభ కమిషనర్‌కు సూచించారు. 2025-26 సంవత్సరానికి బడ్జెట్‌లో ఇ-ఖాతా అంశాలకు సంబంధించి సన్నాహకసభ నిర్వహించారు. సమావేశంలో నగరసభ ఉపాధ్యక్షులు రూప నవీన్, కమిషనర్ మంజునాథ్, నగరసభ మాజీ అధ్యక్షులు అప్సర్‌పాషా, సుమిత్ర రమేశ్, సభ్యులు అనిల్, లాయర్ మునిరాజు, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల ప్రగతిపై నివేదిక

▸▸ విద్యాసంస్కరణల సలహాదారు దొరస్వామి సమర్పణ



ఎంఆర్ దొరస్వామి

బెంగళూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక ప్రభుత్వ విద్యాసంస్కరణల సలహాదారుగా వ్యవహరించిన పీఈఎస్ యూనివర్సిటీ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎంఆర్ దొరస్వామి సమగ్ర నివేదికను ప్రభుత్వానికి సమర్పించారు. మంగళవారం సీఎం సిద్దరామయ్యకు నివేదిక పంపారు. ఐదు దశాబ్దాలుగా విద్యారంగంలో ఎన్నో ఆవిష్కరణలు, గుణాత్మకమైన పీఈఎస్ విద్యాసంస్థలను కొనసాగిస్తున్న చాన్స్‌లర్ ఎంఆర్ దొరస్వామిని యడియూరప్ప ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు విద్యాసంస్కరణల సలహాదారులుగా కేబినెట్ హోదాలో అవకాశం కల్పిం చారు. అప్పట్లో దొరస్వామి ప్రాథమిక పాఠశాలల ప్రగతిపై రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేకంగా సర్వే చేయించారు. అందుకు అనుగుణంగా పలు అభివృద్ధి మార్గదర్శకాలు సూచించారు. వీటిలో పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు పెంచే అంశం కీలకమైనది. శాసనసభ్యులు, పార్లమెంటు సభ్యులు తమ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలను దత్తత తీసుకునే విషయమై బడ్జెట్‌లోనూ పొందుపరిచారు. కార్పొరేట్ సంస్థలు, రాష్ట్రంలోని యూనివర్సిటీలు, పాఠశాలల దత్తత ప్రక్రియ కొనసాగించాయి. 26 సంస్థల ముఖ్యులు పాఠశాల అభివృద్ధిలో కీలక భూమిక పోషించారు. ప్రతి పాఠశాలకు తాగునీరు, శౌచాలయం, ప్రహరీగోడ ఉండాలని సంపూర్ణ నివేదికలో పొందుపరిచారు. పాఠశాలలో యోగాను అమలు చేయాలని సూచించారు. ప్రాథమిక విద్యలో నైతికత బోధించాలని 'కథాలోక' అనే పుస్తకాన్ని పీఈఎస్ యూనివర్సిటీ ద్వారా రూపొందించి రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు అన్నింటికీ పంపిణీ చేశారు. ఏడాదిక్రితం మధ్యంతర నివేదికను ప్రాథమిక అంశాలతో సమర్పించారు. తాజాగా 136 పేజీలతో సమగ్ర నివేదికను అందచేశారు.

28 నుంచి నిరవధిక నిరసన



సమావేశంలో మాట్లాడుతున్న నారాయణస్వామి

బాగేపల్లి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): రిటైర్డు ఉపాధ్యాయులు తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర రిటైర్డు ఉద్యోగుల సంఘం తాలూకా విభాగం ఆధ్వర్యంలో బెంగళూరు ఫ్రీడంపార్కులో నిరవధిక నిరసన చేపట్టనున్నట్టు సంఘం రాష్ట్ర సంస్థాపక సంచాలకులు ఆర్ నారాయణ స్వామి అభిప్రాయపడ్డారు. పట్టణంలోని కార్యనిరత పాత్రికేయుల సంఘం భవనంలో మంగళవారం మీడియాతో మాట్లాడుతూ 2022 జులై 1నుంచి 2024 జులై 31వరకు రిటైరైన ఉపాధ్యాయులకు ఏడో వేతనసంఘం ప్రకారం డీసీఆర్‌జీ, కమ్యుటేషన్, లీవ్ ఎన్‌క్యాష్ వంటి సదుపాయాలను వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 28న శుక్రవారం ఫ్రీడం పార్కులో నిరవధిక నిరసన చేపట్టనున్నట్టు తెలిపారు. ప్రధాన సంచాలకులు పీఎన్ భాస్కరరెడ్డి మాట్లాడుతూ గతంలో తాము నిరసన చేపట్టామని, ముఖ్యమంత్రి స్పందించి శాసనసభ సమావేశాల అనంతరం సభకు ఆహ్వానించి చర్చించి పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారన్నారు. అయితే ఇంతవరకు హామీ అమలు కాలేదన్నారు. ఈనెల 28న రాష్ట్రవ్యాప్తంగా సుమారు 25వేలమంది నిరసనలో పాల్గొననుండగా తాలూకానుంచి 60మంది దాకా పాల్గొంటారన్నారు. మీడియా సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన సంచాలకులు కృష్ణారెడ్డి, అధ్యక్షులు వెంకటస్వామి, డీవీ శ్రీనివాసయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి గెఫెక్స్ సదస్సు



సదస్సు వివరాలు వెల్లడిస్తున్న మంత్రి ప్రియాంకఖర్గే

బెంగళూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్ అండ్ ఎక్స్‌టెండెడ్ రియాలిటీ (ఏవీజీసీ)లో ప్రపంచంలోనే నెంబరువన్ కేంద్రంగా కొనసాగుతున్న బెంగళూరులోని లలిత్ అశోక్ హోటల్‌లో ఈనెల 27 నుంచి మూడు రోజులపాటు గెఫెక్స్ సదస్సు జరగనుందని ఐటీబీటీశాఖల మంత్రి ప్రియాంక ఖర్గే ప్రకటించారు. మీడియా అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ రంగంలో రాణిస్తున్న పరిశ్రమలు భాగస్వామ్యం అవుతాయమన్నారు. యానిమేషన్ రంగానికి భవిష్యత్తులో ఆదరణ ఉందన్నారు. ఐటీబీటీ సెక్రటరీ డాక్టర్ ఏక్‌రూప్‌కౌర్, బెంగళూరు గెఫెక్స్ ఛైర్మన్ బీరేన్‌ఘోష్‌లు పాల్గొన్నారు.

మహాశివరాత్రికి సన్నద్ధం

ఏర్పాట్లు ఇలా...



విద్యుద్దీపాలతో అలంకరణ



గవిగంగాధరేశ్వరస్వామి ఆలయంలో....



మంజునాథనగర్‌లోని ఆలయం వద్ద గజరాజు...

మహాశివరాత్రికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ధర్మస్థళ మంజునాథేశ్వర, నగరంలోని గవిగంగాధరేశ్వర తదితర ప్రముఖ ఆలయాలు ముస్తాబు చేస్తున్నారు. మంజునాథ నగర్‌లోని మంజునాథస్వామి ఆలయం వద్ద ఏర్పాట్లు ఘనంగా చేశారు. (బెంగళూరు, ఆంధ్రజ్యోతి)

చిక్కిన చిరుత

రాయచూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : గడచిన నెల రోజులుగా ప్రజలను ముఖ్యంగా పశువుల యజమానులను, గ్రామస్థులను భయభ్రాంతులకు గురి చేసిన చిరుత బోనుకు చిక్కింది. రాయచూరు నగర సమీపం మలియాబాద్ అటవి ప్రాంతంలోని పలు సార్లు జంతువుల పై దాడి చేసి ఆవులు, మేకలు ఇతర వాటిని వేటాడి తిన్న చిరుత అటవి శాఖ అధికారులు ఏర్పాటు చేసిన బోనులో బంధిగా పట్టుబడింది. ఆరు రోజుల క్రితం మలియాబాద్ సమీపంలోని గోశాల పై దాడి చేసిన చిరుత అక్కడి ఒక ఆవును చంపి తినడంతో ఒక్క సారిగా గ్రామస్థుల్లో కలకలం రేగింది. దీంతో అప్రమత్తమైన అటవి శాఖ అధికారులు చిరుతను బంధించేందుకు నాల్గు చోట్ల బోన్లు అమర్చడమేగాక ఎక్కడికక్కడ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి చిరుత కదలికలను గమనించే ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం వేటుకొచ్చిన చిరుత అటవి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బోనులో బంధిగా చిక్కింది. దీంతో గ్రామస్థులు ఊపిరి పీల్చుకున్నారు.



బోనులో చిక్కిన చిరుత

30 ఏళ్ల తరువాత కలుసుకున్న

పూర్వ విద్యార్థులు

బళ్లారిరూరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా హరప్పనహళ్లి తాలుకా హరిసుకేర గ్రామంలో జీవీడీఎస్ ప్రౌఢశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు మంగళవారం కలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు 30 ఏళ్లనాటి అనుభవాలను గుర్తు చేసుకుని ఆనందంగా గడిపారు. వారు చదివిన గ్రామంలో దండి దుర్గమ్మదేవి కోళ్ల శతేశ్వరదేవి అమ్మవార్ల ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎర్రబసి కోటేష్, మల్లేష్ హుస్సేన్, రవికుమార్, నటరాజు, మల్లేష్, నాగప్ప, సునిల్ కుమార్, చంద్రప్ప, వాగేష్ గౌడ, మరియప్ప, పరమేష్, మంజునాథ్ గిరీష్ విద్యార్థులు పాల్గొన్నారు.



దుర్గమ్మదేవి ఆలయంలో పూజలు నిర్వహిస్తూ..

తీరు మార్చుకోవాలని హితవు



మిఠాయిలు పంపిణీ చేస్తున్న కరవే నాయకుడు రాజఘట్టె రవి

దొడ్డబళ్ళాపుర, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలో కర్ణాటక వాహనాలపై ఎంఈఎస్ కార్యకర్తలు వ్యవహరించిన తీరుపై కరవే రాజఘట్టె రవి స్పందిస్తూ ఇకనైనా తీరు మార్చువాలని హితవు పలికారు. దేవనహళ్ళి - దొడ్డబళ్ళాపుర జాతీయ రహదారి 648పై సాగుతున్న మహారాష్ట్ర వాహనదారులకు మంగళవారం గులాబీలు, మిఠాయిలు అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరాఠా మాట్లాడలేదంటూ కండక్టర్‌పై దాడి చేసిన తీరు సరికాదన్నారు. హింసతో ఏమీ సాధించలేరన్నారు. తాము వారి మాదిరిగా చట్టాన్ని అతిక్రమించడం లేదన్నారు. తమ ఆగ్రహం ఎంఈఎస్‌లోని కొందరి దూకుడు శైలిపై మాత్రమే అని అమాయకులపై కాదన్నారు.

ఆదర్శంగా అభివృద్ధి చేస్తాం..



వాహనాలకు పచ్చజెండా ఊపుతున్న ఎమ్మెల్యే

ముళబాగిలు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): నగరసభకు మరో ఏడు నెలల్లో జరగనున్నాయని ప్రస్తుతం ఉన్న సభ్యులు మళ్లీ గెలుపొందాలంటే మంచి పనులతో ప్రజల మద్దతు పొందాలని ఎమ్మెల్యే సమృద్ధి మంజునాథ్ అభిప్రాయపడ్డారు. నగరసభ ఆవరణలో ముఖ్యమంత్రి అమృత నగరోత్థాన యోజన 4లో రూ.58.91 లక్షలతో నిర్మించిన పౌరకార్మికులకు నూతన అల్పాహార గృహం, విశ్రాంతి గది, చార్జింగ్‌తో సాగే చెత్త తరలింపు వాహనాలను ప్రారంభించి మాట్లాడారు. నగరసభ సమగ్ర అభివృద్ధికి పార్టీలకు అతీతంగా సభ్యులంతా సహకరించాలని కోరారు. జిల్లాలో మాదిరి నగరసభగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. ఈ సందర్భంగా నగరసభ అధ్యక్షురాలు షబనాబేగం, ఉపాధ్యక్షురాలు సరళ, జేడీఎస్ ప్రధాన కార్యదర్శి రఘుపతిరెడ్డి, మాజీ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

సైన్స్‌పై వినూత్న జాగృతి



విద్యార్థుల వినూత్న ప్రదర్శన

విజయపుర, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): నేషనల్ సైన్స్ డేలో భాగంగా ప్రభుత్వ మాదిరి బాలికల పాఠశాలలో ఖుషి ఫౌండేషన్, అగస్త్య ఫౌండేషన్ సహకారంతో సైన్స్‌పై జాగృతి కల్పించే ప్రత్యేక ప్రదర్శనలు నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మనోహర్ మాట్లాడుతూ ఏటా ఫిబ్రవరి 28న నేషనల్ సైన్స్ డే నిర్వహిస్తారు. విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ ప్రదర్శనలు ఆకట్టుకుంటాయి. కార్యక్రమంలో పురసభ సభ్యులు శిల్ప అజిత్, పతంజలి యోగ శిక్షణ సమితి జిల్లా సంచాలకులు దీప రమేశ్, పాఠశాల అభివృద్ధి సమితి ఉపాధ్యక్షురాలు రాధా, సభ్యులు మాలా, వీణా, సుమయ్య సుల్తాన్ తదితరులు పాల్గొన్నారు.

కేక్‌తో వెళ్తూ ప్రమాదం


చింతామణి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): స్నేహితుడి పుట్టినరోజుకోసం కేక్ కొనుగోలు చేసి బైక్‌పై వెళ్తుండగా ఇద్దరి యువకులను గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన సంఘటన తాలూకాలోని కెంచార్లహళ్ళి పోలీస్‌స్టేషన్ పరిధిలోని సిద్దేపల్లి క్రాస్ వద్ద సోమవారం రాత్రి సంఘటన చోటు చేసుకుంది. గుడిసెలపల్లికి చెందిన మోనిశ్ (22) సతీశ్ (22)లు ఇద్దరూ కలసి స్నేహితుడి పుట్టినరోజుకోసం సిద్దేపల్లిక్రాస్‌లోని కేక్ కొనుగోలు చేసి ద్విచక్రవాహనంపై వెనుతిరిగి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొంది. గుర్తు తెలియని వాహనం డ్రైవర్ అక్కడనుంచి పరారయ్యారు. గాయపడిన వారిని స్థానికులు గమనించి చింతామణి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం కోలారు ఆసుపత్రికి తరలించారు. కెంచార్లహళ్ళి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

అంబేడ్కర్ ఆశయాలు సాధిద్దాం: ఎమ్మెల్యే



విగ్రహం వద్ద మాజీ మంత్రి శ్రీరాములు, మాజీ ఎమ్మెల్యే సురేష్ బాబు

కంప్లి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): సమాజంలోని ప్రతి ఒక్కరు రాజ్యాంగాన్ని రచించిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలు, సిద్ధాంతాలను అలవరుచుకోవాలని ఎమ్మెల్యే జేఎన్ గణేష్ తెలిపారు. మంగళవారం కురుగోడు తాలుకాలోని గుత్తిగనూరు గ్రామంలో అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆంజనేయులు, మాజీ మంత్రులు శ్రీరాములు, మాజీ ఎమ్మెల్యే సురేష్ బాబులు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రులు ఆంజనేయులు, శ్రీరాములు మాట్లాడుతూ సమాజానికి అనుగుణంగానే రాజ్యాంగాన్ని రచించారు. ప్రతి ఒక్కరు ఆయనను ఆదర్శంగా తీసుకున్నప్పుడే తాము నిత్యజీవితంలో ముందడుగు వేస్తామని తెలిపారు. ఆయన రచించిన సంవిధానం ప్రకారంగా ప్రతి ఒక్కరికి న్యాయం లభించడంతో పాటు ఎన్నికల్లో పోటీ చేసేందుకు అనుగుణంగా మారిందన్నారు. కురుగోడు తాలుకాతో పాటు కంప్లి, బళ్లారి సిరుగుప్ప, ఇతర పట్టణాలు, గ్రామాల నుంచి కూడా అభిమానులు తరలివచ్చారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1608.69	1,587.25
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	0	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	8,104	763
నీటి నిల్వ (టీఎంసీలు)	35.07	8.89

అరకొర సౌకర్యాలతోనే అనాటమీ..!

● వైద్య విద్యార్థుల ప్రాక్టికల్స్‌కు అందని మృతదేహాలు ● కొరవడుతున్న అవగాహన ● అన్ని కళాశాలల్లో అదే దుస్థితి

బళ్లారి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): వైద్యులకు మానవ శరీరంపై సంపూర్ణ అవగాహన తప్పనిసరి. వైద్య విద్యలో వారికి మృతదేహంతో ప్రాక్టికల్స్ నిర్వహించి దేహం గురించి వివరిస్తారు. ఇందుకోసం కొందరు దాతలు మృతదేహాలను ఆస్పత్రికి అందజేయడం పరిపాటి. అయితే ఇటీవల మృతదేహాలు అందుబాటులో లేని కారణంగా అరకొర చదువులతో వైద్య విద్య పూర్తి చేయాల్సి వస్తోంది. ఎంబీబీఎస్ చదువుతున్న స్టుడెంట్స్‌కు ప్రాక్టికల్ చేసేందుకు(అనాటమీ) మృతదేహాల కొరత వేధిస్తోంది. ఐదున్నరేళ్ల ఎంబీబీఎస్ కోర్సులో అతి ముఖ్యమైనది అనాటమీ. ఈ అనాటమీ ల్యాబ్‌లో మానవుని శరీరం, అందులోని అవయవాలు, అవి ఎక్కడెక్కడ ఉంటాయి.. వాటి ప్రాధాన్యం తదితర వివరాలన్నీ ఉంటాయి. అలాగే గర్భం దాల్చిన తల్లి, తల్లి కడుపులో ఉండే బిడ్డ, కవల పిల్లలు ఉంటే తల్లికడుపులో ఎలా ఎదుగుతారు. అలాగే ఇద్దరకు మించి ముగ్గురు, నలుగురు తల్లికడుపులో బిడ్డలు ఉంటే ఎలా ఉంటారు. వారు బతుకుతారా లేదా అనేక అంశాలు అనాటమిలో ప్రొఫెసర్లు విద్యార్థులకు ప్రాక్టికల్‌గా బోధించాల్సి ఉంటుంది. కానీ అలా జరగడం లేదు. ఎంబీబీఎస్ స్టుడెంట్‌కు అనాటమి క్లాస్‌లో మరణించిన మానవుడి దేహం కొరత ఏర్పడుతోంది.

ఎంబీబీఎస్ కళాశాలలకు ఎంతో ప్రాముఖ్యత

రాష్ట్రంలో ప్రభుత్వ ఎంబీబీఎస్ కళాశాలలు అంటే దేశంలోనే ఎంతో పేరుంది. అలాంటి రాష్ట్రంలోనే అనాటమీ ల్యాబ్‌లో శరీర అవయవాలు అందుబాటులో ఉండడం లేదు. ఇండియన్ మెడికల్ కౌన్సిల్ (ఐఎంసీ) నిబంధనల ప్రకారం ఎంబీబీఎస్ చదువుతున్న ప్రతి 10 మందికి మరణించిన మానవుని శరీరం ద్వారా ప్రాక్టిల్స్ చేయించాలి, అయితే కనీసం వంద మందికి ఒక్కో దేహం కూడా దొరకడం లేదు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఏమూడో నాలుగో మానవుని శరీరాలు ఉంటున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రిల్లోనే కాదు ప్రైవేట్ ఆసుపత్రుల్లోనూ ఇదే దుస్థితి నెలకొంది. ఇటీవల ఎంబీబీఎస్ చదవాలనే విద్యార్థుల సంఖ్య బాగా పెరిగింది. అందుకు తోడుగా ప్రైవేటు కళాశాలలు కూడా పుట్టకొచ్చాయి. ఎంబీబీఎస్ చదివే విద్యార్థులకు చదువుకుంటున్న సమయంలో ప్రాక్టికల్స్ కు మానవుని దేహం లేకుండా పోతే వారు కోర్సు పూర్తి చేసి ఎలా వైద్యం చేస్తారనేది ప్రశ్నగా మారింది. ఇక కొన్ని కళాశాలల్లో 3డీ ద్వారా అనాటమీ తరగతులు నిర్వహిస్తున్నారు.

దేహదానానికి ముందుకు రావాలి

: గంగాధర గౌడ, విమ్స్ డైరెక్టర్



ఎంబీబీఎస్ చదువుతున్న విద్యార్థులకు ప్రాక్టికల్స్ చేయడానికి అవసరం అయిన మృత దేహాలు దానం చేయాలి. చాలా మంది సమాజ సేవకులు, వేధావులు, వారి మరణం అనంతరం శరీరం దానం చేస్తున్నారు. కానీ వారి మరణం తరువాత వారి శరీరంను వైద్యశాలకు దానం చేయాల్సింది వారి బంధువులు, అయితే వీరు అంత్యక్రియలకే అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇటీవల మానవ దేహాలు అప్పగించడంపై ఆసక్తి మరింత కొరవడింది. ప్రజల ఆలోచనల్లో మార్పు వచ్చినప్పుడే భవిషత్తులో భావితరాలకు మంచి వైద్యులను అందిచినవారము అవుతాము. మరణించినా నీ శరీరం విద్యార్థులకు ఉపయోగ పడేలా చూడాలి. విధిలేని పరిస్థితుల్లో 3 డీ ద్వారా అవగాహన కల్పిస్తున్నాం. మూఢనమ్మకాలు వీడి మానవ దేహాలు అప్పగించడానికి ముందుకు రావాలి.



విద్యార్థులకు శరీర అవయవాలతో అవగాహన కల్పిస్తున్న ప్రొఫెసర్లు

పీజీలో విమ్స్ విద్యార్థుల ప్రతిభ

బళ్లారి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ (విమ్స్) గత నెలలో నిర్వహించిన పోస్టు గ్యాడ్యుయేట్ పరీక్షల ఫలితాలు మంగళవారం వెలువడ్డాయి. బళ్లారి మెడికల్ కళాశాల అండ్ రీసెర్చ్ సెంటర్ నుండి పదహారు మంది విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారు. అనాటమీలో శ్రుతి ఏ పుష్పస్ ఫస్ట్ ర్యాంకు, రాకేష్ కుమార్ పీకే ఫార్మకాలజీలో రెండవ సంవత్సరం విద్యార్థి, కమ్యూనిటీ మెడిసిన్ విభాగంలో కేశవ్ పెరుమాళ్, మూడవ స్థానంలో, సహానా ఆర్ 9వ స్థానంలో నిలిచారు. ప్రసూతి, గైనకాలజీ విభాగంలో, ఇంచార, నయన 4వ ర్యాంకును సాధించగా, వినుతవి ఐదవ స్థానాన్ని దక్కించుకున్నారు. ఆర్థోపెడిక్స్‌లో ఎండీ అమీర్ హనీఫ్ మాలిక్, 5వ స్థానంలో, అభిషేక్ రెడ్డి, విక్రమ్ రాయ్‌కర్ 8వ స్థానంలో, తమిళ్ సెల్వన్ 10వ స్థానంలో ఉన్నారు. సుప్రీత సురేష్ నాయక్, అనస్థీషియాలజీలో 5వ ర్యాంకు, భాగ్యశ్రీ 6వ ర్యాంకు సాధించారు. ఈఎన్‌టీలో మధుర 8వ స్థానంలో వుంది. హర్షిణి పాథాలజీలో 8వ ర్యాంకు సాధించగా, అనూష ఎస్ మధ్యల్ ఆప్తల్మాలజీలో పదవ ర్యాంకు సాధించారు.

కండక్టర్‌పై దాడిని ఖండిస్తూ నిరసన

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర సరిహద్దులో కేఎస్ఆర్టీసీ కండక్టర్‌పై దాడిని ఖండిస్తూ రవాణా సిబ్బంది నిరసన చేపట్టారు. మంగళవారం నగరంలోని కలెక్టర్ కార్యాలయం వద్ద ఆర్టీసీ సిబ్బంది, కార్మిక సంఘ నాయకులు ఆందోళనకు దిగారు. టికెట్ అడిగినంత మాత్రాన భాష పేరుతో దూషించడం తగదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. 15 మంది దాడి చేసి పోక్సో పెట్టడం దారుణమన్నారు. దౌర్జన్యాలకు పాల్పడినవారిపై వెంటనే కఠినచర్యలు తీసుకోవాలని కోరారు. సిబ్బందికి రక్షణ కల్పించాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

అధికారుల బైక్ ర్యాలీ



ర్యాలీలో కలెక్టర్ ఎంఎస్ దివాకర్ తదితరులు

హొస్పేట (విజయనగరం), ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఈ నెల 28 నుంచి ప్రారంభం కానున్న హంపి ఉత్సవాలపై అవగాహన కల్పిస్తూ అధికారులు మంగళవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఎంఎస్ దివాకర్ స్వయంగా రాయల్ ఎన్‌ఫీల్డ్ బైకు నడుపుతూ ర్యాలీకి నాయకత్వం వహించారు. అసిస్టెంట్ కమిషనర్ ర్యాలీకి నాయకత్వం వహించారు. అసిస్టెంట్ కమిషనర్ వివేక్, తహసీల్దార్ శృతి, మల్లప్ప గౌడ కూడా బైకులు నడుపుతూ డిప్యూటీ కమిషనర్‌తో పాటు వెళ్లారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి ప్రారంభమైన బైకు ర్యాలీ సాయిబాబా రోడ్డు, ఏపీఎంసీ నీలకంఠేశ్వరాలయం, వందపడకల ఆస్పత్రి, వీఎస్‌సీ కళాశాల రోడ్డు, అంబేద్కర్ సర్కిల్, పునీత్ రాజ్‌కుమార్ సర్కిల్, ఉడిపి హోటల్, హంపి రోడ్డు, అనంతశయన గుడి మీదుగా హంపిలోని విరుపాక్షేశ్వరాలయం వరకు ర్యాలీ జరిగింది. ఉత్సవాల సందర్భంగా హొస్పేట నగరం, కమలాపురం రోడ్లను సుందరంగా అలంకరించారు. హంపి స్మారక చిహ్నాలు ప్రత్యేక విద్యుత్ కాంతుల్లో ప్రకాశిస్తున్నాయి.

గవి సిద్దేశ్వరుడి సన్నిధికి

పాదయాత్రగా తరలిన భక్తులు



బళ్లారి నుంచి బయల్దేరుతున్న భక్తులు

బళ్లారి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): కర్ణాటక-ఆంధ్ర సరిహద్దులో గడినాడు బాగంలో ఇనుప కొండల మధ్య వెలసిన గవిసిద్దేశ్వర స్వామి దర్శనానికి బళ్లారి నుంచి మంగళవారం వందలాది మంది భక్తులు పాదయాత్రగా తరలివెళ్లారు. శివరాత్రి సందర్భంగా స్వామి దర్శనానికి సుమారు 300 మందికి పైగా తరలివెళ్లారు. ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉద్భవ లింగం కావడంతో విశేష ఖ్యాతి పొందిందని, కోరిన కోర్కెలు తీర్చే భగవంతుడు అని భక్తుల నమ్మకం. శివరాత్రి నాడు సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు చేపట్టారు. సినీ నిర్మత కొర్రపాటి సాయి గవి సిద్దేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాదయాత్రలో బిల్వరాజేష్, సుబ్బారావు, బుడా మాజీ అధ్యక్షుడు మారుతీప్రసాద్, కార్పొరేటర్ గుమ్మనూరు జగన్, అల్లం ప్రశాంత్, మేయర్ నందీష్‌బాబు, కమ్మసంఘం జిల్లా అధ్యక్షుడు ముండ్లూరు అనూప్ కుమార్, మాజీ బుడా అధ్యక్షుడు పాలన్న, మెడికల్ షాపు మల్లికార్జున, అనూప్ కుమార్, కార్పొరేటర్ గోవిందరాజులు, విక్కీ, ముండ్రూరు ప్రభంజన్, రాజేష్ పాల్గొన్నారు.



ప్రత్యేక పూజల్లో నిర్మత కొర్రపాటి సాయి

శివరాత్రికి ముస్తాబైన ఆలయాలు

కంప్లి, ఫిబ్రవరి 25 (ఆంధ్ర జ్యోతి): మహా శివరాత్రి వేడుకలకు ఆలయాలు ముస్తాబు అయ్యాయి. కంప్లి పట్టణంలో షుగర్ ఫ్యాక్టరీ ముక్తినాథేశ్వరాలయాలను అందంగా అలంకరించారు. అలాగే ఆంధ్ర, కర్ణాటక సరిహద్దుల్లో వేదవతి నది ఒడ్డున వుండే దిబ్బల సోమేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. శివరాత్రిని పురస్కరించుకుని ఆలయాల్లో రెండు మూడు రోజులు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. అలాగే విజయనగర జిల్లా కొట్టూరు బసవేశ్వరాలయంలో కూడా స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపారు. మొత్తానికి శివరాత్రి సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిపారు.



ముస్తాబైన ముక్తినాథేశ్వరాలయం, బసవేశ్వరస్వామి

విశ్వశాంతికి 12 జ్యోతిర్లింగాల సందర్శన



పాదయాత్రలో పాల్గొన్న యోగిని అక్క, బ్రహ్మకుమారీలు

గంగావతి రూరల్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): విశ్వశాంతిని కోరుకుంటూ 12 జ్యోతిర్లింగాల సందర్శనకు బ్రహ్మకుమారీలు బయల్దేరారు. గంగావతి నగర పరిధిలోని మురహరి నగరంలో వెలసిన బ్రహ్మకుమారి ఈశ్వరీ విశ్వవిద్యాలయం నేతృత్వంలో మంగళవారం విశ్వశాంతి కోసం శాంతి పాదయాత్ర నిర్వహిస్తున్న ఈశ్వరీ విశ్వవిద్యాలయం యోగిని అక్క తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జ్యోతిర్లింగాల పాదయాత్రతో ధార్మిక భావం వెల్లివిరుస్తోందన్నారు. శివరాత్రి వేడుకను ప్రపంచదేశాలైన 146దేశాలలో భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామదేవత దుర్గాదేవి దేవస్థనం నుంచి బయలుదేరిన ఊరేగింపు సకల వాద్య వైభవంతో గాంధీ వృత్తం, బసవణ్ణ వృత్వం, వాసవి సర్కిల్, అంబేడ్కర్ సర్కిల్ మీదుగా శ్రీ కృష్ణ దేవరయా సర్కిల్ నుంచి విశ్వవిద్యాలయానికి చేరింది.

రేడియం స్టిక్కర్లతో ప్రమాదాల నివారణ

● ఆటో డ్రైవర్లకు ఎస్ఐ కాళింగ సూచన



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ కాళింగ

బళ్లారిరూరల్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మోకా పోలీస్ స్టేషన్ పరిధిలో గల మోకా పరిసర ప్రాంతాల్లోని గూడ్స్ ఆటోల డ్రైవర్లకు ఎస్ఐ కాళింగ పలు సూచనలు చేశారు. ప్రమాదాల నివారణకు వెనుక భాగాన రేడియం స్టిక్కర్లు అతికించుకోవాలని గూడ్స్ వాహన డ్రైవర్లకు అవగాహన కల్పించారు. రేడియం స్టిక్కర్లతో చీకట్లో వాహనాలు కనపించడంతో ప్రమాదాలు నివారించవచ్చన్నారు.

మహారథోత్సవం సందర్భంగా శాంతిసభ

ఆంధ్ర, కర్ణాటక సరిహద్దు ప్రాంతం గూళ్యం గాదెలింగప్ప మహారథోత్సవం సందర్భంగా పోలీసులు శాంతి సభ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ కాళింగ మాట్లాడుతూ ఇరురాష్ట్రాల ప్రజలు రథోత్సవాన్ని కనుల పండువగా జరుపుకోవాలన్నారు. అసాంఘిక కార్యక్రమాలు చేపడితే చర్యలు తప్పవన్నారు. సమావేశంలో గ్రామ ప్రముఖులు, యువకులు, గ్రామ పంచాయతీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి నిధులు కేటాయించాలి

● భీమవాద్ దళిత సంఘర్ష్ సమితి డిమాండ్



కలెక్టర్ కార్యాలయ సిబ్బందికి వినతి పత్రం అందజేస్తున్న సభ్యులు

బళ్లారి సిటీ,ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): దళితుల ఆర్థిక అభ్యున్నతి కోసం అంబేద్కర్ ఆర్థిక అభివృద్ధి సంస్థను ఏర్పాటు చేయాలని, దళితుల భూమిని అన్యాక్రాంతం కాకుండా చూడాలని భీమవాద్ దళిత సంఘర్ష్ సమితి కోరింది. పలు డిమాండ్లతో వారు వినతిపత్రాన్ని మంగళవారం జిల్లాకలెక్టర్ సిబ్బంది ద్వారా ముఖ్యమంత్రికి పంపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈసంవత్సరం బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీ నిధులను ఐదు నిర్దిష్ట కీలక రంగాల అభివృద్ధికి ఖర్చు చేయడానికి సాంఘిక సంక్షేమ శాఖకార్పొరేషన్లకు అధికారాలు ఇవ్వాలన్నారు. ఏ అంతర్గత కులానికి అన్యాయం జరగకుండా సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంతర్గత రిజర్వేషన్లను అమలు చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, టీఎస్సీ నిధుల్లో 20శాతం హాస్టళ్లను అప్‌గ్రేడ్ చేయడం, స్కాలర్‌షిప్పులు ఇతర విద్య సంబంధిత సౌకర్యాలను అందించాలన్నారు. ప్రతి కుటుంబానికి కనీసం 5ఎకరాల వ్యవసాయ భూమిని కొనుగోలు చేయడానికి ప్రభుత్వం 20శాతం నిధులను కేటాయించాలన్నారు. ప్రతి తాలూకా జిల్లా ప్రధాన కార్యాలయంలో అన్ని హైటెక్ ప్రైవేట్ ఆసుపత్రుల్లో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన విశాలమైన కొత్త హైటెక్ ఆసుపత్రులను నిర్మించాలని, ఆసుపత్రుల్లో ఉచిత వైద్యం అందిచాలని కోరారు.

మాజీ ఎమ్మెల్యే లింగారెడ్డికి ఘన నివాళి



లింగారెడ్డికి నివాళులర్పిస్తున్న కళాభిమానులు, కుటుంబ సభ్యులు

బళ్లారి సిటీ,ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): నగరంలోని రాఘవ కళామందిరంలో సోమవారం మాజీ ఎమ్మెల్యే హెచ్ లింగారెడ్డి 49వ వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళి అర్పించారు. లింగారెడ్డి చిత్రపటానికి తమ కుటుంబ సభ్యులు, రాఘవమెమోరియల్ అసోసియేషన్, కళాభిమానులు తదితరులు నివాళులర్పించారు. ఈ సందర్భగా రిటైర్డ్ లెక్చరర్ బసవరాజు మాట్లాడుతూ లింగారెడ్డి కురుగోడు ఎమ్మెల్యేగా, ఆయన బళ్లారి నగరంలో కంప్లి చెక్కెర కర్మాగారం, దారపు మిల్లును, జనతా బజార్‌ను స్థాపించి ఎందరికో ఉపాధి కల్పించారన్నారు. రాఘవ కళా మందిర్‌కు ఆయన చేసిన కృషి కూడా అపారమైనది, ఆయన బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పనిచేశారన్నారు. అనంతరం వి.భవానీ ప్రసాద్ స్వరపరిచి శ్రీ లాల్ రెడ్డి దర్శకత్వం వహించిన తెలుగు సాంఘిక నాటకం 'ఒక్క మాటచాలు' నాటకాన్ని ప్రదర్శించారు. ఈ నాటకంలో ప్రవీణ్, రవీంద్ర, లాల్ రెడ్డి, ఆదోని వీణా, తిరుపతి హసీన అందరూ నాటకంలో అద్భుతమైన ప్రదర్శనలు ఇచ్చారు. రాఘవ మెమోరియల్ అసోసియేషన్ సంస్థ గౌరవాక్షులు కే.చన్నప్ప, అధ్యక్షుడు కేటేశ్వరరావు,ఉపాధ్యక్షుడు విష్ణువర్దన్‌రెడ్డి, కోశాధికారి పి.ధనంజయ, విఠల్, శ్యామ్ సుందర్,పి.శ్రీనివాసులు, చౌదరి, కృష్ణ, రమేశ్‌బాబు, చంద్రరెడ్డి, రామబ్రహ్మం, భీమనేని బాస్కర్, ప్రసాద్, రామప్రకాష్‌రెడ్డి, సురేంద్రబాబు, రామచంద్ర, రమణప్ప భజంత్రీ, కళాభిమానులు పాల్గొన్నారు.

రథోత్సవాన్ని వైభవంగా జరుపుకుందాం : ఎమ్మెల్యే



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణేష్

కంప్లి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రసిద్ధి గాంచిన కురుగోడు దొడ్డ బసవేశ్వరస్వామి రథోత్సవాన్ని మార్చి 14న వైభవంగా జరుపుకుందామని ఎమ్మెల్యే గణేష్ పిలుపునిచ్చారు. మంగళవారం దేవదాయ శాఖ ఏర్పాటు చేసిన రథోత్సవం ఏర్పాట్లు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రథోత్సవానికి వచ్చే భక్తాదులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని వాహన పార్కింగ్ కురుగోడు రోడ్డులోను, గెణకల్, ముష్టిగట్టి, కంప్లి బాదనట్టి రోడ్లలోను ఏర్పాటు చేసి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. వీధి లైట్లు, పరిశుభ్రత ఉండేలా చూడాలన్నారు. ఎలాంటి సంఘటనలు జరుగకుండా పోలీసు బందోబస్తు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ అధికారిణి హనుమంతప్ప, పురసభ ముఖ్య అధికారి హర్షవర్దన్, ఈవో నిర్మల, డీఎస్పీ ప్రసాద్ గోఖలే, పురసభ అధ్యక్షులు శేకన్న, ఉపాధ్యక్షులు మల్లికార్జున, వైద్యాధికారి మంజునాథ్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ నిధుల దుర్వినియోగంపై ఉద్యమం

● కేజీఎఫ్ మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నాయకుడు సంపంగి

బళ్లారి సిటీ,ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఈ బడ్జెట్ కోసం షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల కోసం కేటాయించిన రూ.15,000కోట్లను ఉపయోగించుకోవడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, దీనికి వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాన్ని నిర్వహిస్తామని కేజీఎఫ్ మాజీ ఎమ్మెల్యే, బిజేపీ నాయకులే సంపంగి హెచ్చరించారు. మంగళవారం నగరంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీల నిధులను పక్కదారి పట్టిస్తోందన్నారు. బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు విజయేంద్ర నాయకత్వంలో 28 లోక్‌సభ నియోజకవర్గాలను 14జట్లుగా విభజించడం ద్వారా పోరాటం చేపడామన్నారు. మార్చి 7న కలెక్టర్ల కార్యాలయాల ముందు నిరసన తెలిపి ప్రభుత్వానికి వినతిపత్రం సమర్పిస్తామన్నారు. శాసనమండలి సభ్యుడు వై.ఎం.సతీశ్, బిజేపీ జిల్లా శాఖ అధ్యక్షుడు అనిల్‌నాయుడు, విజయనగరం జిల్లా శాఖ అధ్యక్షుడు సంజీవ్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కేఎస్.దివాకర్, శరణు తరికేరి, ఓబలేష్, హనుమంతప్పగురులింగనగౌడ తదితరులున్నారు.

హోసూరు జోన్

15 కేజీల గంజాయి స్వాధీనం

హోసూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): బాగలూరు సమీపంలో అక్రమంగా తరలిస్తున్న 15 కిలోల గంజాయిని, కారు, సెల్‌ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో ఒడిశా రాష్ట్రానికి చెందిన ఓ యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హోసూరు తాలూకా బాగలూరు పోలీసులు మంగళవారం కారును తనిఖీ చేస్తుండగా 15 కిలోల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



స్వాధీనం చేసుకున్న గంజాయి

పార్కింగ్ ఏర్పాటు చేయాలని నిరసన

హోసూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): హోసూరు రాంనగర్‌లోని సుబ్రహ్మణ్య స్వామి ఆలయానికి చెందిన భూమి హిందు ధర్మాదాయ శాఖ ఆధీనంలో ఉంది, హోసూరు తేరు పేటలోని హిందూ ధర్మాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో ఈ స్థలం లీజుకు టెండర్ నిర్వహించనున్నట్లు మంగళవారం ప్రకటించారు. హిందూ ధర్మాదాయ శాఖ అధీనంలో ఉన్న స్థలంలో ప్రైవేట్ ఆస్పత్రికి పార్కింగ్ కోసం టెండర్ వేశారని వీహెచ్‌పీ భజరంగదళ్ పార్టీ రాష్ట్ర ఆర్గనైజర్ కిరణ్, బీజేపి జిల్లా అధ్యక్షుడు నారాయణన్, జిల్లా మాజీ అధ్యక్షుడు నాగరాజు, ఆర్ఎస్ఎస్, హిందూ ధర్మాదాయ శాఖ కార్యాలయాన్ని తొలగించారు. సుబ్రహ్మణ్యస్వామి ఆలయ నిర్మాణానికి కేటాయించిన భూమిని లీజుకు ఇవ్వొద్దని డిమాండ్ చేస్తూ తేరుపేటలోని హిందూ ధర్మాదాయ శాఖ కార్యాలయాన్ని పెద్ద సంఖ్యలో ప్రజలు నిరసన తెలిపారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా అన్ని పార్టీల తరపున వ్యతిరేకంగా నిరసన తెలిపారు.



ఆందోళనలో వివిధ పార్టీల కార్యకర్తలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్ కుమార్

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి: కలెక్టర్

హోసూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి జిల్లాలో 12 వ తరగతి పరీక్షలు మార్చి 3నుంచి 25వరకు, 9-11 వ తరగతి పరీక్షలు మార్చి 5నుంచి జరగనున్నాయి. కృష్ణగిరి విద్యా జిల్లాలో 51 కేంద్రాలు, హోసూరు విద్యా జిల్లాలో 36 కేంద్రాల్లో మొత్తం 87 కేంద్రాల్లో ఈ పరీక్షలు జరుగనున్నాయి. కృష్ణగిరి, హోసూరు విద్యా జిల్లాల్లో మొత్తం 22627 మంది విద్యార్థులు, 274 మంది దివ్యాంగులు హయ్యర్ సెకండరీ ప్రథమ సంవత్సరం పబ్లిక్ పరీక్షకు హాజరు కానున్నారు. విద్యాశాఖ అధికారులతో ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశామని కలెక్టర్ దినేశ్‌కుమార్ తెలిపారు. బస్సు సౌకర్యం కల్పించాలని, పరీక్షా కేంద్రాలలో తాగునీరు సదుపాయం కల్పించాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో హోసూరు సబ్ కలెక్టర్ ప్రియాంక, ఎడ్యుకేషన్ అధికారి మునిరాజు, శాఖాధికారులు పాల్గొన్నారు.

అన్నప్రసాదానికి 22 టన్నుల బియ్యం తరలింపు

హోసూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): హోసూరు నుంచి సరిహద్దులోని ఆంధ్రప్రదేశ్‌కు వాహనాల్లో 22 టన్నుల బియ్యం, కూరగాయలు, పుచ్చకాయలు, కిరాణా సామగ్రిని తరలించారు. మహాశివరాత్రి సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లోని పలమనేరు సమీపంలోని పురాతన కొండ దేవాలయం వద్ద 25వేల మంది భక్తులకు హోసూరు ప్రాంతానికి చెందిన సేవా సంఘం ఆధ్వర్యంలో 22 టన్నుల బియ్యం, కూరగాయలను చిన్న ఎలసగిరి ప్రాంతంల్లో సేవా సంఘం తరపున ప్రతి సంవత్సరం గత 8 సంవత్సరాలుగా పురాతన జలకంఠేశ్వర స్వయంభు పార్వతి పరమేశ్వరన్ ఆలయంలో అన్నదానం చేస్తున్నారు. 9వ సంవత్సరంగా 25 వేల మందికి అన్నదానం చేసేందుకు సేవాసంఘం కార్యనిర్వాహకుడు షణ్ముగం ఆధ్వర్యంలో 100 మంది పర్యవేక్షిస్తారు.



బియ్యం, కూరగాయలతో భక్తుల బృందం